# కా॥ ఖోకన్ మజుందార్ అంతిమయాత్ర - అంత్యక్రియలు




కా॥ ఖోకన్ మజుందార్ అంతిమయాత్ర

**సిలిగురి, 31-5-17 :**

2017 మే 19వ తేదీన నక్సల్బరీ ఉద్యమనేత, సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కా॥ ఖోకన్ మజుందార్ రెండోసారి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. ఆయనను వెనువెంటనే మొదట నక్సల్బరీలోని ఆసుపత్రికి, ఆ తర్వాత రాత్రి 11:30 గం॥కు అక్కడి నుండి నార్త్‌బెంగాల్ మెడికల్ కాలేజి హాస్పిటల్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటి నుండి మే 29న శాశ్వతంగా కన్నుమూసేవరకూ ఆయన స్పృహలో లేరు. ఆసుపత్రిలోని వైద్యులు ఆయనను బతికించటానికి శాయశక్తులా కృషిచేశారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు.

మరణానంతరం కా॥ ఖోకన్ మజుందార్ మృతదేహాన్ని నక్సల్బరీలోని సిపిఐ(ఎం-ఎల్) కార్యాలయం వద్ద ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఒకరోజు వుంచారు. వివిధ తరగతుల ప్రజానీకం పార్టీ ఆఫీసు వద్దకు వచ్చి ఆయనకు నివాళులర్పించారు.

మే 31వ తేదీన కా॥ ఖోకన్ మజుందార్ భౌతికకాయాన్ని సిలిగురి కాంచనజంగ స్టేడియంలో ప్రజలు, అభిమానుల సందర్శనార్థం వుంచారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కామ్రేడ్స్ మధు, అలోక్‌ముఖర్జీ, సుబోధ్‌మిత్ర, శంభు మహతొ దివంగత నాయకునికి కడసారి నివాళులర్పించారు. ఇంకా నివాళులర్పించిన వారిలో కామ్రేడ్ ఖుదన్ మల్లిక్, నాధూరామ్ బిస్వాస్, సునీతా విశ్వకర్మార్కర్ వున్నారు.

సిపిఐ(ఎం-ఎల్) లిబరేషన్ నాయకులు కామ్రేడ్స్ కౌశిక్ పాల్, వాసుదేవ్‌ఘోష్, అభిజిత్ మజుందార్‌లు కా॥ ఖోకన్ మజుందార్‌కు నివాళులర్పించారు. సిపిఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసి సిసిఎమ్ కా॥ సుశాంత్ ఝూ కా॥ఖోకన్‌కు జోహార్లర్పించారు. పిసిసి సిపిఐ(ఎం-ఎల్) నుండి కా॥ రబిరే, కా॥ వీరేన్ సర్కార్; సిపిఐ(ఎం-ఎల్) రెడ్‌స్టార్ నుండి కా॥ గౌర్‌బైద్య కా॥ ఖోకన్ మృతదేహంపై పూలమాలలుంచి నివాళులర్పించారు. ఎస్‌యుసిఐ, ఆర్‌పిపి, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీల నాయకులు హాజరై జోహార్లర్పించారు.

శ్రామిక కిసాన్ సంగ్రామి మోర్చా మరియు ఏపిడిఆర్ వంటి ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరై కా॥ ఖోకన్‌కు నివాళు లర్పించారు.

నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజి వైద్య విద్యార్థులకు కా॥ ఖోకన్ మృతదేహాన్ని అప్పగించేవరకు అంతర్జాతీయ శ్రామిక గీతాన్ని ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కాంచన జంగ స్టేడియం నుండి ఎయిర్‌వ్యూ ప్యాలెస్ వరకు ప్రజలు కా॥ ఖోకన్ మజుందార్ అంతిమ యాత్ర సాగింది. కా॥ ఖోకన్ లౌకికవాది అని తెలియజెప్పేందుకు ఆయన మృతదేహాన్ని దహనం చేయాలని చాలా కొద్దిమంది ప్రజలు కోరారు. ప్రజా ప్రయోజనాలమేరకు కా॥ ఖోకన్ మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించాలని, ఖోకన్ మజుందార్ లౌకిక నిబద్ధతను ఈనాడు కొత్తగా రుజువు చేసుకోవాల్సిన అవసరమేమీ లేదనే సిసి నిర్ణయంతో కామ్రేడ్స్ అందరూ ఏకీభవించారు.

**సంస్మరణసభ**

కోల్‌కతాలోని సీల్దా స్టేషన్‌కు దగ్గర మౌలాలీలోని యువకేంద్రలో దివంగత నాయకుని సంస్మరణసభ 2017 జూన్ 18న జరిగింది. ఈ సభలో సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర నాయకులతోపాటు వివిధ విప్లవ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాతంత్రవాదులు పాల్గొని కా॥ ఖోకన్ మజుందార్ జీవిత విశేషాలను, ఆయన సాగించిన ఉద్యమ కృషిని, ఆయన జీవితంలోని విలువైన అంశాలను నెమరువేసుకొని ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

oooo